

కంట్రోల్ రూం నుంచి ఎన్నికల కమిషన్‌కు నివేదికలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్


జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్ నుంచి రోజు వారి నివేదికలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు పంపించాలని కలెక్టర్ అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నిమిత్తం కలెక్టరేట్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ నుంచి రోజు వారి నివేదికలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు పంపించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఎన్నికల నివేదికల సమర్పణ, సివిజిల్, సువిధ యాప్ కంట్రోల్ రూమ్ నిర్వహణ తదితర అంశాలపై ఎన్నికల కంట్రోల్ రూమ్ నుంచి రోజు వారి నివేదికలు ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకుంటూ ఉండాలన్నారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫోన్‌కాల్స్‌పై వెంటనే ప్రతిస్పందన ఉండాలన్నారు. కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిఆర్ఒ కొండయ్య సూచించారు. కంట్రోల్ రూమ్‌కు సంబంధించి 8838174425కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలన్నారు.

క(ల్తీ)ల్లు..!

ప్రజల ఆరోగ్యాలు ఏమైతే మాకేంటి.. ఎవరు చచ్చిపోతే మాకేం..! అనేలా కొందరు వ్యాపారులు బడుగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. డబ్బు సంపాదనే పరమావధిగా భావించి కల్తీకల్లు కాటుతో జనం జీవితాలను ఛిద్రం చేస్తున్నారు. అధికారం అండగా యథేచ్ఛగా కల్తీ వ్యాపారాన్ని మూడు చెట్లు 300 సీసాల కల్లు అనేలా కొనసాగిచ్చేస్తున్నారు. కాలకూట విషాన్ని పేదల శరీరాల్లోకి నింపి డబ్బులు దండుకుంటున్నారు. మత్తు పదార్ధాలు కలిపిన కల్లు తాగుతూ చాలా మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. మరికొందరు మానసికస్థితి కోల్పోతున్నారు. మరణాలూ సంభవిస్తున్నాయి. దీనిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.



అమ్మకానికి తయారు చేస్తున్న కల్లు



ప్రజాశక్తి-హిందూపురం

అనంతపురం జిల్లాలో 258 కల్లు దుకాణాలు (టీఎస్‌లు), శ్రీసత్యసాయి జిల్లాలో 79 టీఎస్టీ(ట్రీ ఫర్ ట్యాపర్), 150 టీసీఎస్ (టాడీ కోఆపరేటివ్ సొసైటీ)లు ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 496 దుకాణాలు ఉండగా, అనధికారికంగా మరో వెయ్యి వరకు అదనంగా ఉంటున్నాయి. ఎక్సైజ్ రికార్డుల్లో మూసివేసినట్లుగా ఉన్న దుకాణాల్లోనూ జోరుగా కల్లు విక్రయాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం ఏయే దుకాణం పరిధిలో ఎన్ని ఈత చెట్లు ఉన్నాయి..? వాటి నుంచి రోజుకు ఎంత కల్లు ఉత్పత్తి అవుతోంది అనే వివరాలు పక్కాగా ఉండాలి. ఈత చెట్లకు నెంబర్లు కేటాయించాలి. అయితే ఇవేవి ఒక క్రమ పద్ధతిలో జరగడం లేదు. ఎక్సైజ్ అధికారులు కొన్నేళ్ల కిందటి లెక్కల్ని నివేదికలో చూపుతూ కాలం వెల్లదీసేస్తున్నారు.

చెట్లు తక్కువ కల్లు ఎక్కువ..!

శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని హిందూపురం, మడకశిర నియోజకవర్గాలను ఎక్సైజ్ శాఖ టాడి హబ్‌గా గుర్తించింది. ఈ ప్రాంతాల్లో ఈతచెట్లు తక్కువగానే ఉన్నాయి. చెట్లు తక్కువగా ఉన్నా కల్లు వ్యాపారం మాత్రం మూడు చెట్లు 300 సీసాలు అన్న చందంగా కొనసాగుతుండడం విశేషం. హిందూపురం ప్రాంతంలో ఈత చెట్టు వనాలు నామమాత్రంగా ఉన్నాయి. ఎప్పుడో తాతలు, ముత్తాతల కాలంలో ఉన్న ఈతవనాలు ప్రస్తుతం కనుమరుగయ్యాయి. అక్కడక్కడ మాత్రం కొన్ని కనిపిస్తాయి. ఎక్సైజ్ అధికారులకు మాత్రం ఎటుచూసినా ఈతవనాలే కనిపిస్తున్నాయి. ప్రశ్నిస్తే పాత రికార్డులు తెరిచి ఆ గ్రామంలో... ఈ గ్రామంలో ఈత వనాలు ఉన్నాయంటూ 50 సంవత్సరాల నాటి లెక్కలను నేటికీ చూపిస్తూ కాలం గడిపేస్తున్నారు. ఈత చెట్లే లేకపోయినా ఈ ప్రాంతంలో భారీగా కల్లు ఉత్పత్తి జరుగుతోంది.

ఈ కల్లు అంతా చెట్లనుంచి వచ్చిన కల్లు అనుకుంటే పొరబడినట్లే. ఈత చెట్ల నుంచి సేకరించేది పదిలీటర్లు అయితే అమ్మేది మాత్రం వందల లీటర్లలో ఉంటోంది.



రసాయనాలతో కల్లు కల్తీ ఇలా..

10 లీటర్ల స్వచ్ఛమైన కల్లుకు 150 లీటర్ల నీళ్లు కలుపుతారు. నీళ్లు కలపడం వరకు బాగానే ఉన్నా, ఇందులో రసాయనాలు కలపడంతో అసలు ప్రమాదం తాగేవారిని వెంటాడుతోంది. హిందూపురం, మడకశిర, రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో డిమాండుకు సరిపడా ఈత చెట్లు లేవు. దీంతో నీటిలో రసాయానాలు కలిపి కృత్రిమ కల్లును తయారు చేస్తున్నారు. ఎక్కడికక్కడ రహస్య స్థావరాలను ఏర్పాటు చేసుకుని డైజోఫాం, క్లోరో హైడ్రైట్ వంటి నిషేధిత పదార్ధాలను కల్లులో కలుపుతున్నట్లు సమాచారం. అమ్మోనియం మిశ్రమ రసాయనాలు, సోడా యాష్, ఈస్ట్, పంటలకు వాడే యూరియా, కొన్ని రకాల పెస్టిసైడ్‌ను కూడా కల్తీకోసం వాడుతున్నారు. కుంకుడు కాయ రసం కూడా వాడుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం మిశ్రమాన్ని నీటి తొట్టెలో కలియ తిప్పుతారు. తీపి కోసం శాక్రిన్, నురగ కోసం అమ్మోనియం వంటి రసాయనాలను వాడుతున్నారు. ఉదయం పూట తయారు చేసిన మిశ్రమానికి ఈస్ట్ కలిపి సాయంత్రం వరకు పులియబెడతారు. తర్వాత సీసాల్లో నింపి దుకాణాలకు చేరవేస్తున్నారు.

ఆరోగ్యంపై హానికర ప్రభావం

వ్యాపారులు కల్లు లాంటి తెల్లటి విషాన్ని తయారు చేసి మందుబాబులకు అమ్మేస్తున్నారు. దీనికి అలవాటుపడిన వారు కల్తీ విషాన్ని తాగి క్రమక్రమంగా ఆరోగ్యాన్ని గుల్ల చేసుకుంటున్నారు. డైజోఫాం, క్లోరో హైడ్రైట్ కారణంగా నాడీవ్యవస్థ దెబ్బతింటుంది. ఆలోచవశక్తి తగ్గి, మతిమరుపు వస్తుంది. కాలేయంపై ప్రభావం చూపుతుంది. విచక్షణ కోల్పోతారని వైద్యులు చెబుతున్నారు. క్రమేపి ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంటుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

- హానికర రసాయనాలతో కల్లు తయారీ
- గాల్లో కలుస్తున్న బడుగుల జీవితాలు
- సిండికేట్‌గా మారిన వ్యాపారులు
- 3 చెట్లు 300 సీసాలుగా వ్యాపారం
- శాంపిల్స్ సేకరణతో సరిపెడుతున్న ఎక్సైజ్ శాఖ
- ఎన్నికల సమయంలో కల్తీ వ్యాపారం ఎక్కువయ్యే అవకాశం..



హిందూపురం ప్రాంతంలో కల్లు విక్రయిస్తున్న వ్యాపారులు

ఎన్నికల వేళ మరింత అధికం

ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల వేడి జిల్లాలో ఉంది. ఈ నేపథ్యంలో మద్యం విక్రయాలు అధికంగా జరుగుతాయి. ఇప్పటికే కర్నాటక మద్యం విచ్చలవిడిగా జిల్లాలోకి వచ్చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మద్యానికి బదులుగా కల్లు ఇచ్చే ఏర్పాటును కూడా ఆయా ప్రాంత నాయకులు చేస్తున్నారు. దీంతో ఎన్నికల నేపథ్యంలో కల్లు అవసరం మరింత పెరగనుంది. కల్లు విక్రయ దారులు కల్తీతో మరింత ఎక్కువ తయారు చేసి సామాన్యుల ఆరోగ్యాన్ని గుల్ల చేసే ప్రమాదం ఉంది.

వ్యాపారుల సిండికేట్

"హిందూపురం ప్రాంతంలో ఓ సొసైటీ యజమానికి 13 దుకాణాలు ఉన్నాయి. రోజుకు 5 వేల నుంచి 8 వేల లీటర్ల కల్లు విక్రయిస్తారు. ఇందులో 80 శాతం కల్తీనే ఉంటోంది. ఈయన ఎక్సైజ్ అధికారులకు ప్రతి నెలా రూ.2 లక్షలు మామూళ్లు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఈ వ్యాపారంలో ఓ ప్రజాప్రతినిధి, మరొకరు అధికార పార్టీ నాయకుడు ఉన్నారు. మరొక వ్యక్తి కల్తీ కల్లు వ్యాపారం చేసుకునేందుకు ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకి జై కొడుతూ తన పనిని కానిచ్చేస్తున్నాడు. కల్లు వ్యాపారులు సిండికేట్‌గా మారి ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి చేరి వారి వ్యాపారాన్ని కొనసాగిస్తుండడం గమనార్హం.

హైదరాబాద్ నుంచి రసాయనాల దిగుమతి

కల్లులోకి ప్రమాదకరమైన క్లోరైల్, హైడ్రేడ్, డైజోఫామ్ తదితర రసాయనాలను ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. డైజోఫాం క్లోరోహైడ్రైట్ వంటి హానికర పదార్ధాలను హైదరాబాద్ నుంచి తెప్పిస్తున్నట్లు సమాచారం. గుట్టుచప్పుడు కాకుండా గుంతకల్లు, గుత్తి ప్రాంతాలకు తీసుకొచ్చి అక్కడ్నుంచి ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. క్లోరో హైడ్రేట్ కిలో రూ.35 వేలు, వైజోఫాం కిలో రూ.90 వేలు చొప్పున విక్రయిస్తున్నారని సమాచారం. వీటి సరఫరాకు గుంతకల్లు కేంద్రంగా ప్రత్యేక ముఠా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల జిల్లాలో అల్ట్రాజోలం అనే అత్యంత హానికరమైన మత్తు మందును కూడా కల్లులో వినియోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

నమూనాల సేకరణ ఏదీ...?

నిబంధనల ప్రకారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు కల్లు దుకాణాలు తనిఖీ చేయాలి. కల్తీని గర్తించే పరీక్షలను చేయాలి. నమూనాలను ప్రాథమికంగా పరీక్షించడానికి అధికారుల వద్ద మినీ కిట్లు ఉంటాయి. అయితే పరిశీలనలకు సంబంధించి నమూనాల ఫలితాలను ఎక్కడా బయటకు వెల్లడించడం లేదు. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రం ఎక్సైజ్ అధికారులు హడావుడి చేసి పరీక్షలు చేస్తున్నారు. కల్తీ తేలిన దుకాణాలకు కొంత జరిమానా విధించి చేతులు దులుపుకొంటున్నారు.




కల్తీ కల్లు వ్యాపారులను శిక్షించాలి

కల్తీ కల్లుతో పేద ప్రజల ఆరోగ్యాలను హరిస్తున్న వ్యాపారులపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలి. గతంలో కల్తీ కల్లు తాగి లేపాక్షి, పెనుకొండ ప్రాంతాలలో ఎంతో మంది అనారోగ్యం పాలయ్యారు. మరణాలు సైతం సంభవించాయి. ఇలాంటి మరణాలను వ్యాపారులు తప్పుదోవ పట్టించారు. సంబంధిత అధికారులు ఎన్నికల కోడ్ సమయంలోనైనా చిత్త శుద్ధిగా విధులు నిర్వహించి, కల్తీ కల్లును కట్టడి చేయాలి.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్.

పోటీకి దూరంగా సీనియర్లు!

ఇద్దరు మాజీ పిసిసిలు పోటీలో లేనట్టే..?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లా రాజకీయాల్లో సీనియర్లుగా ఉన్న నేతలు ఈసారి ఎన్నికలకు దూరంగానే ఉండనున్నట్టు సమాచారం. మాజీ పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి జిల్లా సీనియర్ నాయకుల్లో ఒకరుగా ఉన్నారు. 1985లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 1989లో మడకశిర నియోజకవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు ఆ తరువాత 1994లో ఓటమి చెందారు. 1999, 2004లో అక్కడి నుంచే గెలుపొంది మంత్రి కూడా అయ్యారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో మడకశిర ఎస్సీకి రిజర్వు కావడంతో ఆయన కళ్యాణదుర్గంకు మారారు. అక్కడి నుంచి గెలుపొంది మంత్రి అయ్యారు. 2012 రాష్ట్ర విభజన తరువాత కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో దెబ్బతింది. ఆ సమయంలోనూ ఆయన పిసిసి అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. అంతేకాకుండా 2014లో పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. 2019లోనూ కళ్యాణదుర్గం నుంచి మరోమారు పోటీ చేశారు. ఇలా 1989 నుంచి ఇప్పటి వరకు పోటీలో ఉంటూనే వస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో ఆయన పోటీకి దూరంగా ఉండే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన సిడబ్లుసి సభ్యుడిగా ఉన్నారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిలతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల్లో పోటీకి మాత్రం దూరంగా ఉండాలని భావిస్తున్నట్టు సన్నిహితులు చెబుతున్నారు. ఇక మరో సీనియర్ నాయకుడు జెసి.దివాకర్‌రెడ్డి 2019 ఎన్నికల నుంచే పోటీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. ఆయన కూడా 1983 నుంచి రాజకీయల్లో ఉంటూ వచ్చారు. ఓటమన్నది ఎరుగకుండా ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలుస్తూ వచ్చారు. వయోభారంతోపాటు, తన కుమారుడి రాజకీయరంగ ప్రవేశం చేయించాలన్న ఉద్దేశంతో 2019లో పోటీ చేయలేదు. ఆ తరువాత కొంతకాలం రాజకీయ అంశాలపై మాట్లాడుతూ వచ్చినా గడిచిన రెండేళ్లుగా పూర్తిగా ఎన్నికలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. జిల్లాలో మరో ముఖ్యమైన నాయకుల్లో డాక్టర్ సాకే శైలజనాథ్ ఒకరు. 2004లో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆ ఎన్నికలతోపాటు 2009లోనూ శింగనమల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి కూడా అయ్యారు. రఘువీరారెడ్డి తరువాత ఆయన పిసిసి బాధ్యతలు చేపట్టారు. 2019 ఎన్నికల్లో ఆయన శింగనమల నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఈయన కూడా ఈసారి ఎన్నికల బరిలో దిగే ఆలోచన లేనట్టు తెలుస్తోంది. ఇలా జిల్లాలో ముఖ్యమైన నాయకులుగా చెలామణి అయిన నేతలు ఈసారి ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.



న్యాయ విజ్ఞాన సదస్సులో సూచనలు ఇస్తున్న అదనపు జిల్లా జడ్జి కం పల్లె శైలజ

అర్హులందరికీ ఉచిత న్యాయ సహాయం

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

అర్హత కలిగిన వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందజేయనున్నట్లు అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ తెలిపారు. శనివారం స్థానిక అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. చాలామంది ఆర్థిక ఇబ్బందుల కారణంగా న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేక పోతుంటారని అలాంటి వారికి ఉచితంగా న్యాయ సహాయం అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. న్యాయ సహాయం అవసరమైన వ్యక్తులు దరఖాస్తు చేసుకుంటే జిల్లా ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి న్యాయవాదులను ఏర్పాటు చేస్తామన్నారు. కోట్నురు నిర్మల వద్ధాశ్రమంలో జరిగిన సదస్సులో న్యాయవాదులు మాట్లాడుతు వద్ధులపై ప్రేమాభిమానాలు కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత కుమార్తెలపై కూడా ఉంటుందని తెలిపారు. ఆశ్రయం లేని వద్ధులు భరణం కోసం న్యాయస్థానాల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం వద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా జరిగిన లోక్ అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో న్యాయవాదులు సుదర్శన్, పీవీ శ్రీనివాస్ రెడ్డి, వన్నెరప్ప, పార్వతి, నవేరా, రామిరెడ్డి, భరత్, రవిచంద్ర, గురునాథ్, గోపాల్, ఎస్ఐ హారూన్‌బాషా, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ సిబ్బంది శారద పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో పొరపాట్లకు తావివ్వొద్దు : ఇఆర్ఒ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



ఇఆర్ఒ వెంకట శివరామిరెడ్డి

ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం రూట్ ఆఫీసర్లకు ఎన్నికల విధులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇఆర్ఒ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నిక ల్లో బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకునేలా సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రొఫార్మాను భర్తీ చేసి వెంటనే అందజేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి వార్డులో, పోలింగ్ బూత్‌లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా వసతులు, సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా విజయవంతంగా నిర్వహించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ రమేశ్, ఎన్నికల ఉప తహశీల్దార్ షణ్ముఖయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల పరిశీలన

ఓబుళదేవరచెరువు : ఎన్నికలవేళ మద్యం, నగదు అక్రమ రవాణాను అరికట్టేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు లను శనివారం ఆర్డీవో భాగ్యరేఖ సందర్శించారు. పోలీసులు చెక్‌పోస్టు వద్ద పకడ్బందీగా విధులు నిర్వహిస్తూ జిల్లాలోకి కర్నాటక మద్యం, నగదు ప్రవేశించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆమె తహశీల్దార్ ఖాజాబీ, ఎస్ఐ వంశీకృష్ణతో కలిసి పెద్దగుట్లపల్లి బోర్డర్ చెక్‌పోస్ట్‌ను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచించా రు. ఆర్డీఒ వెంట ఎఎస్ఐ కిషోర్‌రెడ్డి, ఆర్ఐ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల తనిఖీ

కొత్తచెరువు : స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను శనివారం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగ కుండా, ఇబ్బందులు లేకుండా పరీక్షలను ప్రశాంతం గా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 115 కేంద్రాల్లో 25,779 మందికి 24,456 మంది విద్యార్థులు ఫిజికల్ సైన్స్ పరీక్షకు హాజరు కాగా 1,323 మంది గైర్హాజరయ్యారని వృత్తి విద్య జిల్లా కోఆర్డినేటర్ లాజర్, తెలిపారు. కలెక్టర్ వెంట డిఇఒ మీనాక్షి, ఆర్డిఒ భాగ్యరేఖ, తహశీల్దార్ కళావతి ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం

- వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

పురపాలక సంఘం వ్యాప్తంగా వికలాంగులు, వృద్దులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. పురపాలక సంఘం కార్యాలయంలో శనివారం నాడు తహశీల్దార్ శివప్రసాద్‌రెడ్డితో కలిసి బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సారి ఎన్నికల్లో ప్రత్యేకంగా 85సంవత్సరాలు నిండిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించిందన్నారు. ఇందుకోసం ఫారం 12డితో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే బిఎల్‌ఒలు వారి పరిధిలో ఉన్న వారిని గుర్తించి ఈ విషయాన్ని వారికి వివరించాలన్నారు. ధరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలన చేసి, ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో పిఒ, ఎపిఒ, బిఎల్‌ఒలు భద్రత నడుమ వారికి ఇంటికి వెళ్లి ఓటు వేయించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఇంకా ఎవరైన ఉంటే ఫారం-6తో ధరఖాస్తు చేసకుని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ రెండు అంశాలపై బిఎల్‌ఒలు అప్రమత్తంగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటి తహశీల్దార్ రెడ్డి శేఖర్, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి కోర్టు పనితీరు భేష్ : ఎడిజె



జడ్జికి సత్యసాయి చిత్రపటాన్ని అందిస్తున్న న్యాయవాదులు

పుట్టపర్తి-ప్రజాశక్తి రూరల్

పుట్టపర్తి కోర్టు పనితీరుపై ఫోర్త్ అడిష నల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎం.శోభారాణి సంతృప్తి వ్యక్తం చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా శనివారం ఆమె పుట్టపర్తి కోర్టును సందర్శించి రికార్డులను పరిశీలించారు. ముందుగా ఆమెకు పుట్టపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఎడిజె కోర్టు పనితీరుపై బార్ సభ్యులతో వాకబు చేశారు. కేసుల సత్వర పరిష్కారంలో పురోగతి ఉందని, బార్, బెంచ్ మధ్య సత్సంబంధాలు భేషుగ్గా ఉన్నాయని కితాబునిచ్చారు. మున్ముందు కూడా న్యాయవాదులు కేసుల సత్వర పరిష్కారంలో చక్కటి సహకారం అందించాలని సూచించారు. తదుపరి న్యాయవాదులు ఎడిజె శోభారాణికి సత్యసాయి చిత్ర పటం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్ర మంలో పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి రాకేష్, సభ్యులు యదుభూషణ్, కృష్ణమూర్తి, అబూబకర్, ఇందిర, నాగేంద్ర, హరిక్రిష్ణగౌడ పాల్గొన్నారు.



మంత్రి పెద్దిరెడ్డికి పూలబొకే అందిస్తున్న నవీన్‌నిశ్చల్

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన నవీన్ నిశ్చల్

హిందూపురం : వైసిపి రాయలసీమ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎపి ఆగ్రోస్ ఛైర్మన్ వి.నవీన్‌నిశ్చల్ కలిశారు. తనను వైసిపి జిల్లా అధ్యక్షులుగా నియమించడంపై పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు నియోజకవర్గ పరిశీలకులు రాజారెడ్డి ఉన్నారు.

మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్ : మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో 2024-25కి ఫస్ట్ ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 28 నుంచి మే 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ అమరారమేష్ బాబు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసి, సిఇసి(ఆంగ్ల మాధ్యమం) కోర్సులు ఉన్నాయి. ఓసి, బిసి, ఈడబ్ల్యుఎస్, విద్యార్థులు రూ. 200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 150 రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్కుల మెరిట్, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని, బాలికలకు ఉచిత వసతి గృహం ఉందని ప్రిన్సిపల్ తెలిపారు.

హనుమద్ వాహనంపై నారసింహుని దర్శనం

కదిరి అర్బన్ : ఖాద్రీశుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజైన శనివారం లక్ష్మీనరసింహస్వామి హనుమద్ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భాజాభజంత్రీలు, వాయిద్యాలు, సంగీత కచేరీలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య స్వామి వారి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. హనుమద్ వాహన సేవకు ఉభయ దారులుగా జొన్న వీరయ్య, జొన్న వీరశైవ్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా పట్టణ సిఐ పుల్లయ్య ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో దేవాదాయ శాఖ ఉప కమిషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

25న కదిరి పౌర్ణమి వేడుకలు

కొత్తచెరువు : కదిరి పౌర్ణమి సందర్భంగా స్థానిక పాత ఆంధ్ర బ్యాంక్ వెనుక ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 25వ తేదీ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం అభిషేకం, సాయంకాలం ఉత్సవ విగ్రహ గ్రామోత్సవం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వాలంటీర్లపై వేటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

కదిరి టౌన్ : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ప్రచారంలో పాల్గొన్న వాలంటీర్ల తీరుపై శుక్రవారం ప్రజా శక్తిలో 'వైసిపి సేవలో వాలంటీర్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. దీనిపై అధికా రులు విచారణ చేపట్టి వాలంటీర్లపై వేటు వేశారు. రూరల్ మండలంలోని ఎర్రదొడ్డి పంచాయతీ లో గురువారం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్‌అహ్మద్ నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వాలంటీర్లు గౌతమ్ నాయక్, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సచివాలయాల డైరెక్టర్ శనివారం జీవో జారీ చేశారు. దీంతో వారిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఇన్‌ఛార్జి ఎంపీడీవో అంజనప్ప ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి రాజకీయ పార్టీల సమావేశంలో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

ముదిగుబ్బ : సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తప్పవని సిఐ యతీంద్ర హెచ్చరించారు. సిఐ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో సోషల్ మీడియా, వాట్సప్ గ్రూప్ అడ్మిన్లతో సమావేశం ఏర్పాటు చేశారు. సిఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా గ్రూపుల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ఫొటోలు, వాయిస్ మార్ఫింగ్ చేసి అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా, ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్ తదితర గ్రూపులపై నిఘా ఉంచామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగుబ్బ : స్థానిక 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్ప డుతుందని ఆ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని దొరిగల్లు, గుంజేపల్లి, ముదిగుబ్బ టౌన్ ప్రజలు, రైతులు, వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

చట్టాలపై అవగాహన సదస్సు

రొద్దం : స్థానిక టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పెద్దగువ్వల పల్లిలో అనంతశక్తి సిఇఓ లావణ్య అధ్యక్షతన తహసీన్‌బి ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వ హించారు. బాల్య వివాహాలు, గృహహింస, మద్యపానం, నిర్ణయాధికారంపై అనంత శక్తి సొసైటీ సిబ్బంది నాటిక రూపంలో మహిళలకు అవగాహన కల్పించారు. లావణ్య మహాశక్తి పాలకవర్గ సమావేశం నిర్వహించారు. మహాశక్తి గురించి క్రిస్టమ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళలు

భగత్‌సింగ్ స్ఫూర్తితో ముందుకెళ్దాం

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ జీవితాలు యువతకు ఆదర్శమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి పేర్కొన్నారు. వారి వర్ధంతి సందర్భంగా శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాబావలి వారి సేవలను కొనియాడారు. నేడు సామ్రాజ్యవాద శక్తులు దేశంలో చొరబడి ప్రజల సొమ్మును లూటీ చేస్తున్నాయన్నారు. ప్రజలను మతం మత్తులో, దేవుడు పేరుతో పోరాటంలోకి రాకుండా బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానాన్ని తీసుకొని వచ్చి విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందన్నారు. నాటి పరాయి పాలన నుంచి విముక్తి కోసం పోరాడిన భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడుస్తూ, నేడు విద్య, వైద్యం, దేశ సంపదను ప్రజలకు చెందేలా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, జయచంద్ర, జగన్, భగత్, హర్ష కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : భగత్‌సింగ్ అడుగు జాడల్లో నడుస్తూ ఆయన ఉద్యమాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగుదామని సిఐటియు నాయకులు జగన్మోహన్, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్జాన్ పేర్కొన్నారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశం కోసం చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన అమర వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురూ, సుఖదేవ్ అని కొనియాడారు. వీరి జీవితం యువతరానికి ఆదర్శమన్నారు. ప్రజల మధ్య వైషమ్యాలు పెంచుతున్న మతోన్మాద రాజకీ యాలకు వ్యతిరేకంగా యువత పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విజయ్, నాగరాజు, కృష్ణానాయక్, మాబున్నీసా, బబ్లూ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దామని ప్రగతి శీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర పిలుపునిచ్చారు. పట్టణంలోని సంఘం



పురంలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులు హక్కులు, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటం చేయాలని కోరారు. ఆనాడు తెల్ల దొరల నుంచి సాధించుకున్న స్వాతంత్ర్య దేశాన్ని నేడు మతోన్మాదులు, బిజెపి నుంచి రక్షించుకోవడానికి ప్రతిజ్ఞ చేయాలని పిడికిలి బిగించాలన్నారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పేలా రానున్న ఎన్నికల్లో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పిఎస్‌యు నాయకులు హరికృష్ణ, భరత్, నవీన్, పవన్, గిరీష్ పాల్గొన్నారు.

చిలమత్తూరు : విప్లవ కెరటం భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకొని వచ్చే ఎన్నికల్లో భూర్జువా పార్టీలకు బుద్ధి చెప్పి లౌకిక పార్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అతి పిన్న వయస్సులోనే దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులన్నారు. యువత వారి ఆశయాలను కొనసాగిస్తూ రాజకీయ స్వాతంత్ర్యం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేష్, లక్ష్మినారాయణ, సదాశివరెడ్డి, రహంతుల్లా పాల్గొన్నారు.

డ్రగ్ మాఫియాతో యువత భవిష్యత్తు నాశనం

ప్రజాశక్తి-పెనుకొండ



టీడీపీ ఎంపీ అభ్యర్థి బికె.పార్థసారథి

డ్రగ్ మాఫియా వల్ల యువత భవిత ఛిద్రమవుతోందని టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎంపి అభ్యర్థి బికె.పార్థసారథి శనివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్ మాఫియాకు మూల కారణం వైసీపీ ప్రభుత్వమే అన్నారు. ఒకప్పుడు పరిశ్రమలకు కేంద్రమైన ఎపిని నేడు జగన్ డ్రగ్స్ దిగుమతిలో నంబర్-1 స్థానంలో నిలిపారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడానికే రూ. 50 వేల కోట్ల విలువైన 25 వేల కిలోల డ్రగ్స్‌ని రాష్ట్రంలోకి తీసుకొచ్చారన్నారు. కల్తీ, నాసిరకం మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెటగాటం ఆడుతున్నారన్నారు. విజయసాయిరెడ్డి, జగన్ కలిసి ఇలాంటి అరాచక పనులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డ్రగ్స్ వ్యవహారం ఈ నెల 16వ తేదీ జరిగితే 20వ తేదీ వరకూ గోప్యంగా ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. టిడిపి అధికారంలోకి వస్తే డ్రగ్ రాకెట్‌లో ప్రభుత్వ ప్రమేయాన్ని బయట పెడతామన్నారు. జగన్ పక్షాన దొంగల్లా ఉంటారో, చంద్రబాబు పక్షాన రాజుల్లా బతుకుతారో! ఆలోచించుకోండి అంటూ వాలంటీర్లకు సూచించారు. సిఎం జగన్ స్టీల్ ప్లాంట్‌ను అటకెక్కించారు.. రుషికొండకి గుండు కొట్టారు.. రాష్ట్రాన్ని డ్రగ్స్‌కి కేంద్రంగా మార్చారన్నారు. ఇకనైనా ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిదే గెలుపు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆయన శనివారం పట్టణంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైసీపీని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పాలించిన పాలకులు ఏమాత్రం అభివృద్ధి చేయకపోగా ఇప్పుడు కూటమి కట్టి ముందుకు వస్తున్నారని విమర్శించారు. ఎన్ని పార్టీలు కలిసినా సిఎంజగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమమే వైసిపిని గెలిపిస్తాయన్నారు. ఈ ప్రాంత వాసుల చిరకాల కోరిక అయిన సత్యసాయి జిల్లాను ఏర్పాటు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ ఛైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, తిప్పన్న, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, నాయకులు గంగాద్రి, కౌన్సిలర్లు సాయిగీత, చెరువు భాస్కర్‌రెడ్డి, సూర్యగౌడ్, మెప్మా జిల్లా అధ్యక్షురాలు సాయి లీలారెడ్డి, జిల్లా నాయకురాలు కవితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ఆంధ్ర, కర్నాటక సరిహద్దులో ప్రత్యేక నిఘా

చిలమత్తూరు : కొడికొండ చెక్‌పోస్ట్‌తో పాటు మరవకొత్తపల్లి క్రాస్, కొడికొండ, సోమఘట్ట, వీరాపురం ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఆర్ఒ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. ఆయన శనివారం జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో పర్యటించారు. అన్ని చోట్లా ప్రత్యేక చెక్‌పోస్ట్‌లు నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. ఎంసిసి, ఎస్ఎస్‌టి టీంలు యాక్టివ్‌గా పని చేయాలన్నారు. రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమాలు చేపడితే అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్ భాగ్యలత, వీఆర్వో రవిశంకర్‌రెడ్డి ఉన్నారు.



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న జెసి అభిషేక్‌కుమార్



రన్ ఫర్ జీసస్ పోస్టర్లను విడుదల చేస్తున్న పాస్టర్

30న 'రన్ ఫర్ జీసస్'

హిందూపురం : ఈ నెల 30వ తేదీ పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి ఏర్పాటు చేసినట్లు సి అండ్ ఐజి మిషన్ చర్చి సంఘం పాస్టర్ రెవరెండ్ స్టీఫెన్ రాజ్, సంఘం సెక్రటరీ డాక్టర్ ఎ.నాగేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం చర్చిలో 'రన్ ఫర్ జీసస్' పోస్టర్లు, జెండాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 30వ తేదీ ఉదయం 6 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ప్రారంభం అవుతుందని క్రైస్తవులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి విక్టర్ జాషువా, జాయింట్ సెక్రటరీ సాల్మన్‌రాజ్, జాయింట్ ట్రెజరర్ ఆనంద్‌రాజ్, సభ్యులు జార్జిబాబు పాల్గొన్నారు.


పాడిరైతులకు సంగం డెయిరీ చేయూత

కదిరి టౌన్ : సంగం పాల డెయిరీ యాజమాన్యం పాడి రైతులకు ఎంతగానో సహాయం చేస్తుందని పట్నం వెటర్నరీ డాక్టర్ రాఘవేంద్ర తెలిపారు. పాడి రైతు షామీర్‌బాషాను సంగం డెయిరీ యాజమాన్యం ఆదుకుంది. రైతు రూరల్ మండలంలోని ఎర్రదొడ్డి, కొత్తపల్లి గ్రామ సంగం డెయిరీలో పాలు పోసేవాడు. రైతకు చెందిన ఆవు అనారోగ్యంతో మృతి చెందింది. ఆ ఆవుకు డెయిరీ యాజమాన్యం ఇన్సూరెన్స్ చేయించి ఉండడంతో నష్టపరిహారం కింద చెక్కు మంజూరైంది. కార్యక్రమంలో సంగం డెయిరీ వెటర్నరీ డాక్టర్ రాఘవేంద్ర, మలకవేముల డెయిరీ ఇన్‌ఛార్జి ప్రసాద్, విష్ణు, ఏజెంట్ కరుణాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత సమాజ స్థాపనే లక్ష్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అంధత్వ రహిత సమాజ స్థాపనే పీస్ వెల్ఫేర్ సొసైటీ ముఖ్య ఉద్దేశమని అల్ట్రా విజన్ ఐ హాస్పిటల్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొగ్గు సురేష్ పేర్కొన్నారు. పుట్టపర్తి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో శనివారం శిల్పారామం ఆడిటోరియంలో వరల్డ్ ఆప్టోమెట్రిస్ట్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బొగ్గు సురేష్ అధ్యక్షత వహించగా విదేశీయులు హెల్గో హోస్ట్ జ్యోతి ప్రజ్వలన చేశారు. టైటాన్ ఐ ప్లస్ రీజనల్ మేనేజర్ రాజారెడ్డి, గ్రీన్ భారత్ శంకరనారాయణ, విజయలక్ష్మమ్మ, రఘుపతి, సత్యనారాయణ, ప్రజాపతి, మహేష్, డాక్టర్ యువరాజ్ పాల్గొని ప్రసంగించారు. బొగ్గు సురేష్ మాట్లాడుతూ పుట్టపర్తి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ద్వారా ఎందరో పేద విద్యార్థులకు ఉచిత విద్యనందించడమే కాక, వేలాది మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. స్థానిక సత్యమ్మ గుడి వద్ద ఉన్నా అల్ట్రా విజన్ ఐ ఆసుపత్రి ద్వారా భవిష్యత్తులో కోటి మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, లక్ష మందికి కంటి ఆపరేషన్లు చేయాలని, పేద విద్యార్థులకు ఉచితంగా విద్య నందించడమే పీస్ వెల్ఫేర్ సొసైటీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సంస్థకు సేవలందించిన వాలంటీర్లు, విద్యార్థులకు సురేష్ ఆధ్వర్యంలో అవార్డులు ప్రదానం చేశారు. పలువురు ప్రముఖులకు సత్యసాయి చిత్రపటం అందజేసి సన్మానించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సివి ప్రసాద్, లక్ష్మీరెడ్డి, శ్రీదేవి, వినయ్, తదితరులు పాల్గొన్నారు.



విదేశీయులకు సత్యసాయి చిత్రపటం అందజేసి సన్మానిస్తున్న డాక్టర్ బొగ్గు సురేష్



బైక్ ర్యాలీలో పాల్గొన్న వైసీపీ అభ్యర్థి మక్బూల్


వైసిపి ఆధ్వర్యంలో భారీ బైక్‌ర్యాలీ

కదిరి టౌన్ : ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం వైసీపీని గెలిపించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్.మక్బూల్ అహ్మద్ ప్రజలను కోరారు. వైసిపి ఆధ్వర్యంలో శనివారం తనకల్లు లో 200 ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేపట్టారు. ఆ ర్యాలీ నల్లచెరువు, గాండ్లపెంట మండలాల మీదు గా రాచినేపల్లి వరకూ సాగింది. అక్కడ ర్యాలీలో మక్బూల్ అహ్మద్ పాల్గొన్నారు. అనంతరం ఆయన బండకాడపల్లి, రాచినేపల్లి, దిగువ హరిజనవాడ, ఎగువ హరిజనవాడ, కాట్నేపల్లి, పాముదుర్తివారిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మక్బూల్ మాట్లాడుతూ నవరత్నాలు ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో లబ్ధి పొందారని, మరో నాలుగు రోజుల్లో ప్రజలు మెచ్చే మేనిఫెస్టోను సిఎం జగన్ విడుదల చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎండి ఇస్మాయిల్, నాయకులు సాదత్ అలీఖాన్, గోపాలకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్బూల్‌ను కలిసిన గోవర్ధన్

వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సంపంగి గోవర్ధన్ శనివారం పట్టణంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్.మక్బూల్‌అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బడుగు, బలహీన వర్గాలను కలుపుకుని మక్బూల్ గెలుపునకు కృషి చేస్తానన్నారు.

వైసిపిలో చేరిన వారికి కండువా వేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



వైసిపిలో పలువురు చేరిక

రొద్దం : మండలంలోని బీదానపల్లి, రాచూరు గ్రామానికి చెందిన పెంకుల అంజి, బంగారు ముత్యాలప్ప, తిరుములేశు, రామకృష్ణ శనివారం టిడిపిని వీడి మంత్రి కెవి.ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. వారికి మంత్రి వైసిపి కండువా వేసా సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మ, ఎంపీపీ చంద్రశేఖర్, అక్కులప్ప, మండల కన్వీనర్ తిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని మంత్రి ఉషశ్రీచరణ్ క్యాంపు కార్యాలయంలో శనివారం మండలం లోని సత్తారుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గోపాల్‌రెడ్డి మంత్రి సమక్షంలో వైసిపిలో చేరాడు. గోపాల్‌రెడ్డికి మంత్రి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి వర్క్‌షాపులో సునీల్‌కుమార్

మడకశిర : టిడిపి, బిజెపి, జనసేనపార్టీల మద్దతుతో వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో శనివారం టిడిపి అధినేత చంద్రబాబు అధ్యక్షతన విజయవాడలోని ఎ కన్వెన్షన్ హాల్‌లో వర్క్‌షాపు నిర్వహించారు. అందులో మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డా. సునీల్ కుమార్, పార్టీ పరిశీలకులు పర్వీన్‌తాజ్, కోఆర్డినేటర్, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, మురళి, ఎన్నికల పొలిటికల్ మేనేజర్ డాక్టర్ శ్రీనివాసమూర్తి, పాల్గొన్నారు.



టిడిపి వర్క్‌షాపునకు హాజరైన సునీల్‌కుమార్, శ్రీనివాస్‌మూర్తి, తదితరులు

నేరాలు ఘోరాలు

కారు డోరు తగిలి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్



దామోదర్(ఫైల్‌ఫోటో)

పట్టణంలో ఇన్నోవా కారు డోరు తగిలి బైక్‌పై వస్తున్న లెక్కల దామోదర్(38) దుర్మరణం చెంది న ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దకమ్మవారిపల్లికి చెందిన దామోదర్ పుట్టపర్తిలో చిన్న హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శ్రీమతి ఈశ్వరమ్మ పాఠశాలలో చదువుతున్న కుమారునికి శనివారం భోజన క్యారియర్ ఇవ్వడానికి బైక్‌పై బయల్దేరి. సత్యసాయి పాఠశాల సమీపంలో నిలబడిన ఇన్నోవా కారులో కూర్చున్న వ్యక్తి ఉన్నఫళంగా డోరు తెరిచాడు. వేగంగా వస్తున్న దామోదర్‌కు డోరు తగిలి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఉపప్రతికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గతంలో అతని భార్య అనారోగ్యంతో మృతి చెందింది. తల్లిదండ్రుల మృతితో కుమార్తె, కుమారుడు అనాథలయ్యారు. దామోదర్ బంధువుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం.. కాపర్ వైరు, ఆయిల్ చోరీ

గోరంట్ల రూరల్ : మండలంలోని కొండాపురం పంచాయతీ చింతమానుపల్లి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు 3 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని రూ. 59 వేల విలువ చేసే కాపర్‌వైరు, ఆయిల్‌ను ఎత్తుకెళ్లినట్లు ఎఎస్ఐ ధనుంజయరెడ్డి తెలిపారు. ఆనందరెడ్డి పొలాన్ని సిఆర్ అశోక్‌రెడ్డి కౌలుకు తీసుకొని పంట సాగు చేస్తున్నాడు. 19వ తేదీ అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 3 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు, ఆయిల్ ఎత్తుకెళ్లారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ వెల్లడించారు.

కర్నాటక మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని సాయినగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. పోలీస్ స్టేషన్ లో శనివారం సిఐ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి సాయినగర్‌లోని ఓ హోటల్‌లో మద్యం విక్రయిస్తున్న వనం లక్ష్మీనారాయణ, గంగమ్మల ను అరెస్టు చేసి వారి నుంచి 13 కర్నాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. డాబాలు, హోటళ్లు, తదితర ప్రాంతాల్లో ఎక్కడైనా ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినా, రవాణా చేసినా, గంజా యి, మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం రాత్రి డాబాలపై దాడులు చేసి మద్యం తాగుతున్న 9 మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిఐతో పాటు ఎఎస్ఐ పుట్టప్ప, సిబ్బంది అబ్దుల్, శశికళ ఉన్నారు.

వారం రోజుల్లో చోరీ కేసు ఛేదింపు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో వారం రోజుల క్రితం ఓ దుకాణంలోకి ముగ్గురు వ్యక్తులు చొరబడి మహిళ గొంతుకోసి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. బాధితురాలు అమృతవల్లి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం కేసు నమోదు చేసుకుని దుండుగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చోరీకి పాల్పడిన దొంగలను శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఒక మైనర్, ఒక బాలనేరస్థుడు, తన్వీర్ ముగ్గురూ కలిసి మహిళ గొంతు కోసి చోరీకి పాల్పడ్డారు. వీరి నుంచి బంగారు గొలుసు, కమ్మలు, వెండిపూత పూసిన వినాయక విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని వాటిని సిఐ స్టేషన్‌లో బాధితురాలికి అప్పగించారు. చోరీ కేసును ఛేదించిన ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని సిఐ అభినందించారు.



ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న వైసిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపిక

ఇఫ్తార్ విందుకు హాజరైన వైసిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు

హిందూపురం : పట్టణంలోని రహమత్‌పురంలో 16వ వార్డు కౌన్సిలర్ షాజియా, ఇన్‌ఛార్జి ఫరూఖ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో వైసిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపిక, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ పాల్గొన్నారు. వారు అందరితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి ముస్లింలకు భోజనం వడ్డించారు. అనంతరం ఆటోనగర్‌లో మైనారిటీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు వేణురెడ్డి, కౌన్సిలర్లు, ముస్లింలు పాల్గొన్నారు.

ఎంపి టికెట్లను బిసిలకు కేటాయించాలి

ముదిగుబ్బ : ఉమ్మడి అనంతపురం జిల్లా పార్లమెంటు సీట్లను బిసిలకు కేటాయించాలని రాయల సీమ బిసి ఐక్యవేదిక అధ్యక్షుడు కొట్టాల శ్రీరాములు పేర్కొన్నారు. ముదిగుబ్బలో శనివారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి వాల్మీకులు, కురుబలు, వడ్డెర్లు అండగా ఉన్నారని కావున అనంతపురం ఎంపి సీటు కురుబలకు, హిందూపురం ఎంపి సీటు వాల్మీకులకు కేటాయించాలని, వడ్డెర్లకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మల్లెల నారాయణస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అమరాపురం : మండలంలోని హల్కూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు హిమంతరాజు తల్లి సిద్ధలింగమ్మ మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆ గ్రామం వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈరన్నతో పాటు నాయకులు నరసింహ మూర్తి, క్రిష్ణమూర్తి, ఉగ్రనరసింహ, వీరక్యాతరాయ, దాదాపీర్, శీనప్ప, నాగభూషణం ఉన్నారు.

సమాయత్తం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడటంతో అటు రాజకీయ పార్టీలు, ఇటు అధికార యంత్రాంగం ఎన్నికలకు సమయత్తమవుతున్నాయి. నాలుగో విడతలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. ఏప్రిల్ 18న నోటిఫికేసన్ విడుదల చేసే విధంగా ఎన్నికల సంఘం షెడ్యూల్ ఇచ్చింది. నాలుగో విడతకు ఎన్నికలు వెళ్లడంతో రాజకీయ పార్టీలు, అధికార యంత్రాంగానికి సమయం కలిసొచ్చింది. వచ్చే నెల వరకూ గడువు ఉండటంతో అన్నిరకాల ఏర్పాట్లు చేసుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే వైసిపి అన్నిస్థానాలకూ అభ్యర్థులను ప్రకటించడంతో వారందరూ ఏర్పాట్లలో తలమునకలయ్యారు. అసంతృప్తులు ఎక్కడైనా ఉంటే వాటిని చల్లార్చుకుంటున్నారు. ప్రచారాల కోసం గ్రామ గ్రామానికీ తిరిగే పనులు చేపట్టారు. ప్రతిపక్ష టిడిపి కూడా ఇదే తరహాలో ఎన్నికలకు సిద్ధమవుతోంది. అయితే ఇంకా అభ్యర్థుల ఖరారు పూర్తి కాలేదు. మూడు జాబితాలు విడుదల చేసినా అనంతపురం పార్లమెంటు, గుంతకల్లు, అనంతపురం అసెంబ్లీలు అభ్యర్థుల ప్రకటన పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా స్థానాల్లో ఎవరిని బరిలో దింపనుందో చూడాల్సి ఉంది. మరోవైపు కాంగ్రెస్, వామపక్షాలు ఇండియా వేదికగా ఎన్నికలకు సమయత్తమవుతున్నాయి. ఇంకా అభ్యర్థులను వీరు ప్రకటించలేదు. త్వరలోనే ప్రకటించే అవకాశముంది. ఈ రకంగా ఈ ఎన్నికలు ఇప్పుడున్న వరకూ చూస్తే త్రిముఖ పోరు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల సమయం ఆసన్నమవుతుండటంతో ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు మొదలయ్యాయి. అధికార వైసిపి నాయకులు బాగేపల్లిలో వాచ్‌లతో పట్టుబడటం గమనార్హం. ఇవి ఓటర్లను ప్రతోభ పెట్టేందుకే తీసుకెళుతున్నట్టు గుర్తించి బాగేపల్లి పల్లిలో కేసు నమోదు చేసియున్నారు. అయితే ఇది తీసుకెళ్తున్నది నాయకుడి గన్‌మెన్ కావడం, ఆయనపైనే కేసు నమోదు చేయడం విశేషం. ఇదేవిధంగా కొంత మంది వలంటీర్లు నాయకుల వెంట ప్రచారంలో పాల్గొన్న వారిపైనా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఎవరు గీతదాటినా ఉద్యోగులపై వేటు తప్పదన్న హెచ్చరికలను ఎన్నికల సంఘం ఇప్పటికే జారీ చేసింది. రాజకీయపరమైన ప్రకటనలు చేసినా చర్యలుంటాయని చెబుతోంది. ఇదే సమయంలో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఓటర్ల నమోదు కొనసాగుతోంది. ఇవిఎం మిషన్ల ఏర్పాట్లు పోలింగు కేంద్రాల్లో ఏర్పాట్లు, కౌంటింగు కేంద్రాల్లోనూ ఏర్పాట్లను పూర్తి చేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. పోలీసులు పహారాను ముమ్మరం చేశారు. సమస్యాత్మకం అనుకున్న గ్రామాల్లో పోలీసు కవాతులు కొనసాగుతున్నాయి. మార్చి ఆఖరు వచ్చే సరికి వేసవితాపం క్రమక్రమంగా పెరుగుతోంది. జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. ఎన్నికల సమయం కూడా కావడంతో దాహార్తిని తీర్చేందుకు నేతలు ట్యాంకర్లు ఏర్పాట్లు చేస్తున్నారు.